

# కథా కౌముది

## నిదురించే తోటలోకి.. రేణుకా అయోల

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*- ఉత్తమ కథానిక విభాగంలో - ప్రశంసాపత్రం పొందిన కథ*

"ప్రేమ రెండు అక్షరాలే" కాని జీవితాంతం దీనికోసం అన్వేషిస్తూనే మిగిలిపోతాం. భర్త ప్రేమకోసం భార్య, భార్య ప్రేమకోసం భర్త, పిల్లల ప్రేమకోసం తల్లీ... కొన్ని సార్లు అన్వేషణ అలాగే మిగిలిపోతుంది. ఒక్కోసారి అది మన జీవితంలో అనుకోని అతిథిలా ప్రవేశిస్తుంది, అప్పుడు మనమే దాన్ని అందుకోవాలో ఒద్దా?

సందేహంలో పడిపోతాం. కాని కాలానికి ఇవేమీ పట్టవు దాని పని అదిచేసుకుపోతుంది.

బూట్లు వేసుకుంటూండగా కాలింగ్ బెల్ మోగింది. రమణి తలుపు తీసి "డ్రైవర్ వచ్చాడు" అంది. వస్తున్నానని చెప్పు..

ఆఫీస్‌కి బయలుదేరిన భాస్కర్ కారు రోజూ వెళ్ళేదారే, రోజులాగే కారు ట్రాఫిక్ మహా సముద్రంలో కొట్టుకుపోతూ నడుస్తూంది.

"నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది.." రేడియోలో పాట శ్రావ్యంగా సాగిపోతోంది. ఈ పాట విన్న ప్రతీసారీ మనసు మారుమూలల్లో ఒదిగిపోయిన జ్ఞాపకం ఒకటి "పుస్తకంలో దాచుకున్న నెమలి ఈకలా" సున్నితంగా కదులుతుంది.

ఈ రోజెందుకో మరీ మరీ మరీ ఆ సంఘటన గుర్తుకొస్తోంది. బియస్సీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి ఇంటికి వస్తుంటే ఒక చిన్న అమ్మాయి 'అక్క మీకు ఉత్తరం ఇమ్మంది' అంటూ తెల్లటి ఎన్వలప్ కవరొకటి చేతిలో పెట్టివెళ్ళిపోయింది. 'ఎవరి దగ్గరనుంచి?' అనుకుంటూ తీసుకునే హడావిడిలో ఆ అమ్మాయి ఎక్కడనుంచి వచ్చిందో గమనించలేదు, అప్పుడే ఆ అమ్మాయిని అడిగేసి ఉంటే ఇన్నేళ్ళ వేదన ఉండేదికాదు. ఆ ఉత్తరంలో ప్రతి అక్షరం గుర్తుండిపోయింది, అమాయకంగా రాసిన ఉత్తరం గుండెపొరల్లో ఒదిగిపోయింది.

ఈ రోజెందుకో పదే పదే గుర్తుకొస్తోంది. ఒకప్పటి పాకీజ సినిమా కూడా గుర్తుకొస్తోంది. పాదాల వేళ్ళ సందులో పెట్టిన చిన్న ఉత్తరంతో కథ మొదలవుతుంది. బ్రిడ్జిమీదనుంచి రైలు వెళ్ళిన ప్రతీసారీ ఆమె మనసు ఆ ఉత్తరం రాసిన మనిషి కోసం చూసే ఎదురు

చూపులు సినిమా చూస్తున్నంతసేపు చక్కటి అనుభూతి. కానీ అలాంటి పరిస్థితే తనకి ఎదురవుతుందని అతను కలలోకూడా ఊహించక పోవచ్చు.

ఆఫీస్ ముందు కారు ఆగింది.

సెల్ మోగింది ఏదో కొత్తనెంబరు, కారు డోర్ తీసి దిగుతూ "హలో" అన్నాడు

"మీరు భాస్కర్ గారేనా? " సందేహంగా అడిగింది ఆవిడ.

"అవును" అన్నాడు.

"నాకు ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు నా పేరు వసుంధర" ఆమె గొంతులో ఆయాసం, "మిమ్మల్ని ప్రేమించానని చాలా ఏళ్ళ క్రితం ఒక ఉత్తరం రాసాను" ఆ మాటతో ఆగిపోయాడు, ఆఫీస్ కారిడార్లో. "హలో" అంది ఆవిడ మళ్ళీ.. "వింటున్నాను చెప్పండి" అన్నాడే గాని ఏదో తెలియని ఉద్వేగం. మాట పెగలటంలేదు.

"మీదాకా ఆ ఉత్తరం వచ్చిందో లేదో తెలియదు కాని, ఒక పాపచేత పంపించాను. ఆ అమ్మాయి ఇచ్చాను అంది. నేనెవరో చెప్పమన్నాను అంది. కానీ అక్కడ నాకెవరూ కనిపించలేదు. ఇంక అక్కడ నిలబడడానికి భయంవేసి వెళ్ళిపోయాను. "

ఆవిడ మాట ఆగిపోయింది. విపరీతమైన ఆయాసం వినబడుతోంది. కంగారుగా "హలో హలో" అన్నాడు.

"నేను ఇంక ఇప్పుడు మాట్లాడలేను. నేను హాస్పటల్లో ఉన్నాను. " దాని పేరు చెప్పి "సాయంకాలం రండి మీతో చాలా మాట్లాడాలి వస్తారుగా" అంది.

"తప్పకుండా వస్తాను. " అంటూ ఇంకా ఏదో అడగబోతుంటే,

"మీరు ఎక్కువ మాట్లాడకూడదు.. " అని ఎవరో అనడం ఫోన్ కట్ అవడం జరిగిపోయింది.

చాలాసేపు వరండాలో గోడనానుకుని నిలబడిపోయాడు. ఏమిటి ఈ ఫోన్? నా నెంబరు ఎలా తెలిసింది. కొన్నేళ్ళుగా ఎదురుచూస్తున్న సంఘటన. ఆవేశంలో వస్తానని చెప్పేసాడు. కాని నిజంగా తను ఎదురు చూస్తున్న ఆమేనా? ఆలోచనలు వాటి మానాన అవి సాగిపోతున్నాయి.

ఆఫీస్ ఛాంబర్లో అడుగుపెట్టిన దగ్గరనుంచి ఊపిరి సలపని పని. మనసు మాత్రం గుండె పొరల్లో దాచిపెట్టుకుని పెట్టుకున్న ఉత్తరాన్ని పదే పదే కళ్ళముందుంచి ఎన్నో ఊహలకి ఆలోచనలకి దారితోస్తోంది.

ఆ రోజు కొన్ని ఏళ్ళ నాటి సంఘటన ఇప్పటికి మనసులో మెదిలే అక్షరాలు. ఆ కవర్ తీసుకుని అందులో ఉన్న తెల్లకాగితం తీసాడు, గుండ్రంగా పొరల్లో దాచిపెట్టుకుని పెట్టున్న ఉత్తరాన్ని పదే పదే కళ్ళముందుంచి ఎన్నో ఊహలకి ఆలోచనలకి దారితీస్తోంది.

ఆ రోజు కొన్ని ఏళ్ళనాటి సంఘటన ఇప్పటికి మనసులో మెదిలే అక్షరాలు. ఆ కవర్ తీసుకుని అందులో ఉన్న తెల్లకాగితం తీసాడు, గుండ్రంగా పొందికగా ఉన్నాయి అక్షరాలు.

"నేను ఇంటర్ మీడియట్ ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాసాను. మీది కూడా బియ్యేస్సీ ఫైనల్ ఇయర్ అయిపోయింది కదా! మీరు మళ్ళీ ఏ కాలేజీలో జాయిన్ అవుతారో తెలియదు. మళ్ళీ మిమ్మల్ని చూస్తానో లేదో తెలియదు, ఎందుకంటే మీకు నేను తెలియదు. చెప్పను కూడా. మిమ్మల్ని నేను ప్రేమించాను కాని ఎదుటపడి చెప్పడానికి భయం, సిగ్గు, అయినా చెప్పకపోవడమే మంచిదిలెండి. మీది మాది ఒక కులం కాదు ఇది తెలిసే ఆగిపోయాను. కాని మీరంటే చాలా ఇష్టం."

ముందు ఆ ఉత్తరం చదవగానే నవ్వొచ్చింది. దానిమీద పేరులేదు కింద సంతకం లేదు, నా ఫ్రెండ్స్ నన్ను ఆటపట్టిస్తున్నారనుకున్నాను. కాని ఎక్కడో నమ్మకం అది అమ్మాయి రాసిన ఉత్తరమేనని. ఆ తరువాత తెలిసింది నా ఫ్రెండ్స్ పనికాదని.

ఆ అమ్మాయి ఎవరో. వెదకడంలో కూడా అర్థంలేదు పేరు తెలీదు. చూడనుకూడా చూడలేదు. వాళ్ళ కాలేజీకి, మా కాలేజికి పెద్ద గోడ ఒక్కటే అడ్డం.

ఇద్దరివి పెద్ద కాలేజీలే. అయినా ఏదో ఆశ నాకోసం వస్తుందని. కాలేజి గేటుముందు రెండు రోజులు నిలబడినా, నావైపుకి ఏ అమ్మాయి రాలేదు. మళ్ళీ అటువైపు వెళ్ళే అవకాశం జీవితంలో రాలేదు.

పి.జి చెయ్యగానే గవర్నమెంటు ఉద్యోగం. పెద్దవాళ్ళు కుదిర్చిన లక్షణమైన అమ్మాయితో పెళ్ళి "రమణి చాలా అనుకూలవతి అయిన భార్య", ఇద్దరు ఆడపిల్లలు.. పెద్దమ్మాయి మాస్టర్స్ చెయ్యడానికి అమెరికా వెళ్ళిపోయింది, చిన్న అమ్మాయి ఇంజనీరింగులో చేరింది. సాఫీగా సాగిపోయే జీవితంలా కనిపించినా మనసు పొరల్లో ఆ ఉత్తరం చిన్నప్పుడు పుస్తకంలో దాచుకునే నెమలి ఈకలా మృదువుగా మెత్తగా గుండెని తడిమేది..

ఏకాంతంలో "మీరంటే చాలా ఇష్టం" అక్షరాలు చెవి దగ్గర గుసగుసలాడేవి.

పేరూ, ఊరూ లేని ఈ ప్రేమ జీవనదిలా మనసులో నిరంతరం సాగుతూనే ఉంది, కొద్దిరోజులు తను కనబడితే బాగుండును అనుకునేవాడిని. అర్థంలేని ఆలోచనలకి నవ్వొచ్చేది, క్రమేపి అది ఒక జ్ఞాపకంగా అందమైన ఊహగా మిగిలిపోయింది. కానీ ఇప్పుడు ఇలా!? అది హాస్పటల్లో కలవాలి. తనకి ఒంట్లో బాగోలేని ఎలాంటి స్థితిలో ఉంది, నా ఫోన్ నెంబర్ ఎలా తెలిసింది?

ఎన్నో సందేహాలకి, ఎన్నో జ్ఞాపకాలకి సమాధానాలు ఈ సాయంకాలం నాకోసం వేచి చూస్తున్నాయి, అనుకున్నాడు కార్ కీస్ జేబులో వేసుకుంటూ. అది సిటీలో బాగా పేరున్న కార్పొరేట్ హాస్పటల్. ఎక్కడుందో సులభంగానే తెలిసింది. ఈ మహానగరంలో ట్రాఫిక్‌ని ఛేదించుకుంటూ అరగంట ప్రయాణాన్ని గంటన్నర పాటు చేస్తూ ఆత్రంగా చేరుకున్న భాస్కర్‌కి పార్కింగ్ ప్లేస్‌లో కారు పార్క్ చేసి నడుస్తూంటే చాలా దిగులుగా అనిపించింది.

ఎంక్వైరీలో వసుంధర పేరు చెప్పగానే ఎటు వెళ్ళాడో చెప్పాడు. అవన్నీ స్పెషల్ రూములు. గది ముందు ఆగి ఒణికుతున్న చేతులతో చిన్నగా తలుపు తట్టాడు. నర్స్ తలుపు తీసింది "రండి భాస్కర్" బలహీనమైన మాటవినిపించింది.

విశాలమైన గదిలో బెడ్ మీద పడుకుని ఉంది వసుంధర, సిస్టర్ ఇంజక్షన్ సెకెన్ లోకి ఎక్కించి వెళ్ళిపోయింది.

బెడ్ మీద ఉన్న "వసుంధరని" చూస్తూ నిలబడిపోయాడు.

"కూర్చో.. " అంది చనువుగా.

మంచానికి దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. మనిషంతా చిక్కిపోయింది, కళ్ళు ఒక్కటే విశాలంగా ముఖంలో కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

"ఏమిటి అలా చూస్తున్నావు? ఇంత అందమైన అమ్మాయితో ఎలా మాట్లాడాలా అనా? " అడిగింది.

నవ్వొచ్చింది.. నవ్వేసాడు.

"ఏం మాట్లాడాలో అర్థంకావటంలేదు నిన్ను ఇలా చూస్తానని. అసలు నిన్ను కలుస్తానని అనులోలేదు, " అతి కష్టమ్మీద ఉద్వేగాన్ని అదుపులో పెట్టుకుని అంటున్న భాస్కర్ చేయిపట్టుకుంది వసుంధర. వెచ్చని స్పర్శ చర్మాన్ని కప్పుకున్న ఎముకలగూడులాంటి చెయ్యి, కళ్ళల్లో నీరు చిమ్మింది ఆప్యాయంగా మెల్లగా పట్టుకున్నాడు.

"నీ ఉత్తరం అందింది. కనీసం పేరు కూడా లేదు నా ఫ్రెండ్స్ ఆటపట్టించడానికి రాసారనుకున్నాను. కాని ఎక్కడో నమ్మక అమ్మాయే రాసుంటుందని అందుకే రెండురోజులు వరుసగా కాలేజి గేటు ముందు నిల్చున్నాను. ఎవరూ రాలేదు. కాని వసుంధర ఆ ఉత్తరం నాకు తోడుగా ఉండిపోయింది. గుండెనంతా ప్రేమతో నింపేసింది. " గబగబా చెప్పేసాడు.

ఇన్నాళ్ళు గుండెల్లో దాచుకున్నది అర్థంలేని విషయంగా మథనపడ్డాడు. కాని ఎదురుగా ఆ నిజం కనపడేసరికి..

ఏడుస్తున్న వసుంధరని చూసి కంగారు పడ్డాడు "ఏమయింది? " అంటూ మంచం మీద కూర్చుని ముఖాన్ని చేతులతో ఆప్యాయంగా పట్టుకున్నాడు.

"ఇన్నాళ్ళూ ఉత్తరం అందలేదు అనుకున్నాను, ఉత్తరమే అందని మనిషి కోసం ఎదురుచూసాను, అలా ఎదురుచూడడంకూడా తప్పు అనుకోలేదు, కాని ఈ దశలో.. "

"వసుంధరా ప్లీజ్ ఏడవకు" కంగారుగా అన్నాడు భాస్కర్.

"ఇది ఆనందంతో వచ్చిన దుఃఖం. నీ ఫోన్ నెంబరు ఎలా తెలిసిందో తెలుసా? నీ ఆఫీస్ కారు డ్రయివర్ రషీద్ కొడుకు మాకు కొత్తగా వచ్చిన కార్ డ్రయివర్, ఇన్ని నెలలుగా హాస్పటల్‌కి వస్తున్నాడా! ఒక్కరోజు కూడా ఇలాంటి ప్రస్తావన రాలేదు.

కాని మొన్ననే మాటల్లో మాటగా వాళ్ళనాన్న కూడా డ్రైవరని గవర్నమెంటు ఉద్యోగమని నీ పేరు చెప్పి నీ డ్రైవరని చెప్పాడు, నీ పేరు వినగానే వివరాలు అడిగాను, అది నువ్వే అయివుంటావని ఆత్రంతో. నువ్వు ఏ కాలేజీలో, ఏ స్కూల్లో చదువుకున్నావో, దగ్గరనుంచి మీ అమ్మాయిల చదువుదాకా చెప్పాడు, నిన్ను చూడాలని బలీయంగా అనిపించింది సెల్ నెంబర్ తీసుకురమ్మన్నాను. పొద్దున్నే తీసుకొచ్చి ఇచ్చాడు. " మాట్లాడుతున్న వసుంధర పరిస్థితి హఠాత్తుగా మారిపోయింది, విపరీతమైన ఆయాసం, ముఖం నీలంగా మారిపోయింది. "సిస్టర్" అంటూ పరిగెత్తుకు వెళ్ళాడు భాస్కర్.

అరగంటలో అక్కడి పరిస్థితే మారిపోయింది. రూములోంచి వసుంధరని "ఐ.సి.యు"లోకి మార్చేసారు. మరో పదిహేను నిమిషాల్లో "సారి" ఆమె చనిపోయారు అంటూ చెప్పేసారు.

అయోమయంగా చూస్తున్న భాస్కర్‌తో "మీరు వెళ్ళి చూడండి" అంటూ ఆమె భర్త, పిల్లలకి కాల్ చెయ్యండి అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

"మీరు చూడొచ్చు" అంది నర్స్ మరోసారి. చుట్టూతా ఉన్న నీలి తెరల మధ్య వంటరిగా నిద్రపోతోంది, శిలలా నిలబడ్డాడు" పెద్ద పెద్దకళ్ళలో ప్రాణం నింపుకుని ఇంత అందగత్తెతో ఎలా మాట్లాడాలా అని ఆలోచిస్తున్నావా" అన్న వసుంధర నిర్జీవమైపోయింది. వెనక్కి తిరిగి పరుగులాంటి నడకతో బయటకి వచ్చేసాడు.

కారులో కూర్చోగానే అద్దం మీద పెద్ద చినుకు టప్‌మని పడింది. అప్పుడు గమనించాడు ఆకాశమంతా మబ్బులతో నిండిపోయిందని. గుండెని చీల్చుకుని వచ్చింది దుఃఖం. స్టీరింగ్ మీద వాలిపోయి ఏడ్చాడు.

తలుపు తీసిన రమణి, భాస్కర్‌ని చూసి ఆశ్చర్యపోయింది, రేగిపోయిన జుత్తు ఎర్రబడిన కళ్ళు. "వంట్లో బాలేదా?" కుర్చీలో కూలబడిన భాస్కర్ నుదిటిమీద చేయి వేసి కంగారుగా అడిగింది.

"ఏంలేదు ఇవాళ మా ఫ్రెండ్ చనిపోయాడు హాస్పటల్లో. చూసి వస్తున్నాను" ఎంత పొడిగా మామూలుగా మాట్లాడదామన్నా కన్నీటి తెరలు కంటిపాపని చుట్టుకుంటున్నాయి.

"అయ్యో అలాగా"!

"రమణి వేడిగా టీ ఇవ్వవా? " అడిగాడు భాస్కర్. రమణి ఆత్రపు చూపులనుండి, అడిగే ప్రశ్నలనుండీ తప్పించుకుంటూ.

టీ తాగి "చాలా అలసటగా ఉంది. భోజనం కూడా వద్దు నేను కాస్సేపు పడుకుంటాను, నిద్రపట్టేస్తే లేపొద్దు. " అంటూ గదిలోకి వచ్చాడు.

●●●

మళ్ళీ ప్రశ్నలు, జ్ఞాపకాలు, మొదలు అయ్యాయి. స్నానం చేస్తున్నా, బట్టలు వేసుకుంటున్నా వసుంధరే కళ్ళముందు కనిపిస్తోంది. ఒక తియ్యటి జ్ఞాపకం క్షణాల్లో ముగిసిపోయింది.

మనసుని గిలిగింతలు పెట్టే ఒక ఊహ క్షణాలలో మాడిమసి అయిపోయింది. ఎవరితోనూ పంచుకోలేని వ్యధ, ఏమని చెప్పుకుంటాం?

ఆఫీస్‌కి రెండురోజులు సెలవు పెట్టేసాడు. అయినా మనసు కుదుటపడలేదు. నీడలా వెంటాడే గాయం మనసుని గిలిగింతలు పెట్టే ఒక ఊహ క్షణాలలో మాడి మసి అయిపోయింది.

రమణి కూడా భాస్కర్ తో పాటు ఆ రెండు రోజులు నలిగిపోయింది, ఏం జరిగిందో తెలియదు, అసలే గుంభనమైన మనిషి మనసులో మాట ఎవరితోనూ చెప్పరు. ఎలా అడగాలి? అంత ప్రాణస్నేహితుడా! అతని మరణం ఇంతటి ప్రభావం చూపిస్తే కోలుకోగలడా? సందేహాల్ని అణుచుకుంటూ గమనిస్తూ ఉండిపోయింది

●●●

ఆ రోజు - ఉదయం మామూలుగా టిఫిన్ కోసం డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చిన భాస్కర్‌ని చూసి ఊపిరి పీల్చుకుంది రమణి. "ఇవాళ ఆఫీస్ కి వెళదామనుకుంటున్నారా అడిగింది"

"సారి.. రమణి" అన్నాడు ప్లేటులో ఇడ్లీ వడ్డిస్తున్న రమణి చెయ్యి పట్టుకుని.

కంగారుపడింది "సారి ఎందుకు? మీ బాధ చూడలేకపోయాను, ఎలా ఓదార్చలో అర్థం కాలేదు. అమ్మాయి అమెరికా నుంచి ఫోను చేస్తూనే ఉంది, మీగురించి ఆందోళన పడుతోంది. రేపు శనివారం కదా తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. శంకర్‌కి చెప్పావా ఈ రోజు ఆఫీస్‌కి వస్తున్నట్లు? ఈ రెండు రోజులు నుంచీ వస్తూనే ఉన్నాడు.. "

రెండు రోజులా? రెండురోజులు ఒంటరిగా గడిపానా, గాయం తగ్గిపోయిందా? ఆలోచనలు ఆగిపోయాయా? ఏదీ జరగలేదు.

"ఇవాళ వచ్చాడా?"

"వచ్చాడు, కింద ఉన్నాడు. ఇందాకే చెప్పాను మీరు వస్తున్నారని"

కారులో కూర్చోగానే "సార్ వసుంధరమ్మగారు మీకు కవర్ ఇమ్మన్నారట" కవర్ అందిస్తూ "మీరు హాస్పటల్‌కి వెళ్ళేరోజు పొద్దున్నే మా అబ్బాయి చేతికి ఇచ్చారట కాని హఠాత్తుగా ఆవిడ చనిపోయేసరికి వాడికి తీరిక దొరకలేదు. మీరు కూడా ఆఫీసుకి సెలవు పెట్టేసారుగా.. సారీ సార్ లేటయ్యింది" అన్నాడు.

"ఫరవాలేదులే" అంటూ కవర్ అందుకున్నాడు భాస్కర్.

కవర్ తెరిచి చూద్దామనుకున్నాడు, ఏకాంతం కావాలి. మళ్ళీ ఆ గాయాలని తట్టుకోవడానికి అనుకుంటూ కారులోనే ఉంచేసాడు.

ఆ ఏకాంతం కోసం సాయంకాలం దాకా కాలాన్ని బలవంతంగా నెట్టుకొచ్చాడు. జీవితంలో మొట్టమొదటిసారిగా పార్కులోకి ఒంటరిగా వచ్చాడు.

పిల్లలు హాయిగా ఆడుకుంటున్నారు. చుట్టూతా పచ్చని గడ్డి. వాలిపోతున్న పొద్దు గూడు చేరుకుంటున్న పక్షులు. అందమైన సాయంకాలం. కొత్తగా వింతగా ఉంది ఎప్పుడు అనుకోలేదు ఇలాంటి సమయం ఒకటి తనకి వస్తుందని..

కవర్ పట్టుకున్నాడు కొన్నేళ్ళక్రితం ఎవరు ఎందుకోసం ఇస్తున్నారో తెలియకుండా తీసుకున్న కవర్ ఇప్పుడు కూడా అదే స్థితి, కాని విచిత్రమైన స్థితి ఏమనిషి కోసం కల నిర్మించుకుని దొరకదులే అని బతుకుతుంటే ఆ మనిషి కనిపించి "ఓ పాటలాగా వచ్చి కన్నీరు నింపి వెళ్ళిపోయింది." ఆలోచనలు విదిలించుకుంటూ చేతిలో ఉన్న కవర్‌ని విప్పాడు. ఒక ఉత్తరంతో పాటు దాని మధ్యలో పెట్టిన

ఫోటోలు జారిపడ్డాయి. ఒళ్ళోపడ్డ ఫోటోస్ తీసాడు. ఒకటి కాలేజ్ గ్రూప్ ఫోటో, ఇంకోటి  బ్లాక్ అండ్ వైట్ ఫొటో. ముందువరసలో నిలబడ్డ అమ్మాయిల్లో ఒక అమ్మాయి చుట్టూ స్కెచ్ పెన్సిల్‌తో సున్నా చుట్టి ఉంది. గుండె దడదడలాడింది. ముందుకు వేసుకున్న రెండు జడలు గుండ్రటి ముఖం వస్తున్న నవ్వుని అదిమిపెట్టిన విశాలమైన కళ్ళనిండా ఆనందం. ఆ ఆనందం, ఆ అందం కలలోలాగా మాయం అయిపోయాయి, కమ్మనైన పాట వినిపించి మాయమైన దేవతలా భూమిలో కలిసిపోయింది. గుర్తుకువస్తే చాలు మనసు గాయపడుతోంది.

ఉత్తరం తీసాడు చదువుతుంటే పొందికైన అక్షరాలు మనసు పొరలలో ముద్రలు వేస్తున్నాయి.

"భాస్కర్ చాలా ధైర్యంగా పిలుస్తున్నాను. ఎందుకంటే ఇవాళ పొద్దున్నే నీకు ఫోను చేసాక రాస్తున్న ఉత్తరం. అప్పటిలాగ మొహమాటం, సిగ్గు, భయంలేవు.

నిన్ను కలుసుకుంటానన్న ఆనందం తప్పించి. చూసావా జీవితం ఎంత చిత్రమైనదో నిన్ను మళ్ళీ కలుస్తాననిగాని, కనీసం చూస్తాననిగానీ అనుకోలేదు. నువ్వు నన్ను చూడలేదు కాని నిన్ను మా కాలేజికి మీ చుట్టాల అమ్మాయిని పిలవడానికి మా క్లాసుకి వచ్చావు. ఆ అమ్మాయి నా స్నేహితురాలు. ఆ రోజు నిన్ను చూసిన క్షణం నుంచీ నువ్వంటే ఇష్టపడ్డాను. నిన్ను చూడడం కోసం మీ కాలేజికి వచ్చేదాన్ని నిన్ను ప్రేమించాను. ఆ పదిహేడేళ్ళ వయసులో నిన్ను ప్రేమించాను. నిన్నే పెళ్ళిచేసుకోవాలని ఎన్నో కలలు, అవన్నీ నావే ఎందుకంటే నేనెవరో నీకు తెలియదు. అయినా ఏదో ధైర్యం. అర్ధంలేని నమ్మకం. కాని ఏదీ జరగలేదు. మన కులాలు వేరు. ఈ రోజుల్లో అయితే? రాస్తున్న నాకే సిల్లీగా అనిపిస్తోంది.

నా అభిప్రాయాలు తప్పించి కనీసం నేనెవరో నీకు తెలియదు. అప్పుడు ఆ ఉద్వేగంలో మన పెళ్ళి జరగదని తెలిసాక నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెలిసాక మీకాలేజికి వచ్చాను. ఉత్తరం రాసాను. నా పేరు చెప్పదలచుకోలేదు. అయినా నా ప్రేమ నీకు తెలియాలి. అంతవరకే ఆలోచించాను. కాలేజ్ వాచ్ మెన్ కూతురు ఎదురుగా కనబడింది. నువ్వు వెళ్ళిపోతున్నావన్న కంగారు. కాలేజీకి సెలవులు అదీకాకుండా నీది నాది కూడా ఫైనల్ ఇయర్స్. ఆ అమ్మాయి చేతికి ఇచ్చి నీకు ఇమ్మన్నాను. ఇచ్చావా అని అడిగితే అదిగో ఆ అబ్బాయికి అని చెప్పింది. అక్కడ ఎవరూ లేరు. నాకు చాలా భయం వేసింది. వేరే ఎవరికో ఇచ్చేసిందని.. ఆ భయంతో మళ్ళీ నీ కాలేజ్ వైపుకి రాలేదు.. మా నాన్నగారికి ఆ ఏడాది వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది.

కానీ భాస్కర్ నిన్ను మరచిపోలేదు.. నా వైవాహిక జీవితం చాలా ఆనందంగా మొదలు అయ్యింది. నా భర్త రవితో నా జీవితం హాయిగా సాగిపోయింది. నాకు ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ కవలపిల్లలు.  బాగా చదువుకుంటున్నారు. కాని ప్రేమ బలం అర్ధమవుతూనే ఉంది నిన్ను మరచిపోనప్పుడు. తప్పో ఒప్పో ద్రోహమో లోకం ఎలా అనుకున్నా నడుస్తున్న జీవితానికి మనస్సుకి సంబంధం లేకుండా గుండెలో పదిలంగా ఉండిపోయావు.

నిన్ను కలవాలనికూడా అనుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం నాకు లంగ్ కేన్సరని, ఎక్కువ కాలం బతకనని తెలిసాక నిన్ను చూడాలని బలంగా అనిపించింది, కాని ఎక్కడ ఉన్నావో తెలియదు. ఒకవేళ తెలిసినా వస్తావని నమ్మకంలేదు. కాని పొద్దున్న నువ్వు వస్తాను అనగానే ఆనందం పట్టలేకపోయాను. ఆ ఉత్తరం అందిందో లేదో అడుగుదామనుకున్నాను. కాని అప్పటికే నా పరిస్థితి బాగోలేదు. బహుశ నువ్వు వచ్చేసరికి బతికి ఉంటానో తెలియదు.. బతికి ఉంటానని నమ్మకం.

అందుకే వెంటనే ఉత్తరం రాసి ఇంటినుంచి ఫోటోలు తెప్పించి డ్రైవరు చేత నీకు పంపిస్తున్నాను ఈసారి నా ఉత్తరం నీకు తప్పకుండా చేరుతుంది. నా కా నమ్మకం ఎందుకో తెలుసా? ఇవాళ ప్రేమికుల రోజు ..వేలంటైన్స్ డే ..!"

●●●

ప్రేమ. ప్రేమకి ఇంతబలముందా? బాహ్యారూపం వయసు ఇవన్నీ లోకానికా? మనసు మనసు మాటే వింటుంటుందేమో, కనుల వెనకాల స్వప్నమై రెప్పల వెనకాల దాచేస్తుంది. దాచుకున్న ప్రేమ కన్నీటి చెమ్మతో పాటు గుండె గూటిలోకి చేరిపోయింది. పంజరంలో బంధించాక గాయాలకి తావెక్కడ?

ఫోటోలని ఉత్తరాన్ని జేబులో పెట్టుకున్నాడు, చల్లటి గాలి ఒంటిని గిలిగింతలు పెట్టింది. భాస్కర్‌కి ఇప్పుడు ఏడుపు రాలేదు.. మనసంతా నిశ్శబ్ధంగా అయిపోయింది.. ఇన్నాళ్ళుగా వెంటాడుతున్నా వెలితి, గాయం, జ్ఞాపకం అన్నీ ముక్కలు ముక్కలుగా తెగిపోయాయి తన చుట్టూ ఒక ఆనందం.

"నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది. కన్నుల్లో నీరు తుడిచి కమ్మని కల ఇచ్చిందీ" ఆ పాటని ఇన్నాళ్ళుగా తన ఊహలలో నిండిపోయిన పాటని పాడుకుంటూ కారులో కూర్చున్నాడు. వెళుతూన్న కారుతోపాటు, జీవితంతోపాటు... పాట వెళుతూనే ఉంది.

●●●

Click here to share your comments on this story